క్లుప్తంగా

సమాజసేవకు పాటుపడాలి

సంబేపల్లె : ప్రతి ఒక్కరూ సమాజసేవకు పాటుపడాలని పారిశ్రామికవేత్త శ్రీనివాసుల రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు శనివారం రాయచోటి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్టీల్ గ్లాసులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న రాగి జావ అమృతంతో సమానమని దానిని తాగేందుకు 500 వందల మంది విద్యార్థులకు గ్లాసులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో లయన్స్ అధ్యక్షుడు షేక్ అహమ్మద్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రైనేజీ కాలువ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న అధికారులు

సిద్దవటం : మండలంలోని మాధవరం- 1లో డ్రైనేజీ కాలువ పనులను శనివారం పరిశీలించినట్టు డివిజనల్ పంచాయతీ అధికారి మస్తాన్‌వలీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా జాయింట్ కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారుల ఆదేశాల మేరకు ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని సిద్దవటం మండలంలోని మాధవరం- 1 గ్రామంలో డ్రైనేజీ కాలువలో నీరు నిల్వ ఉండటంతో గ్రామాన్ని సందర్శించి కాలువను పక్కకు మళ్లించినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో బద్వేల్ డివిజనల్ పంచాయతీ అధికారి రమణారెడ్డి, జమ్మలమడుగు డివిజనల్ పంచాయతీ అధికారి భాస్కర్, ఈఓపీఆర్డీ పులిరామ్‌సింగ్, గ్రామ కార్యదర్శులు లక్ష్మీనరసయ్య, సుదర్శన్ రెడ్డి, భాస్కర్, సుజాత, గంగాధర్, వెల్ఫేర్ అసిస్టెంటు రామాంజనేయులు పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన జెడ్పీ చైర్మన్



చెక్కులను పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

రాజంపేట రూరల్ : ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎం రిలీఫ్ ఫండ్) లబ్ధిదారులకు చేయూతనిస్తుందని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి కొనియాడారు. మండల పరిధిలోని ఆకేపాడులోని ఆకేపాటి ఎస్టేట్‌లో శనివారం లబ్ధిదారులకు చెక్కులను ఆకేపాటి పంపిణీ చేశారు. రాజంపేట పట్టణంలోని ఎగువగడ్డకు చెందిన పచ్చిపులుసు బాలాజీకి రూ.80 వేలు, కడప పట్టణం ఆర్టీసీ కాలనీకి చెందిన మీసాల జయమ్మకు రూ.60వేలు చెక్కులను లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో 14, 03 వార్డు కౌన్సిలర్లు పెనిగలపాటి పెంచలయ్యానాయుడు, సనిశెట్టి నవీన్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు జి.కల్యాణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

5న తిరువణ్ణామలైకు ప్రత్యేక బస్సు

మదనపల్లె సిటీ : మదనపల్లె నుంచి తిరువణ్ణామలైకు 5న ప్రత్యేక అల్ట్రా డీలక్స్ సర్వీసు నడపనున్నట్లు ఆర్టీసీ డిపో-2 మేనేజర్ ఆర్సీ నిరంజన్ తెలిపారు. డిపో నుంచి ఉదయం 10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9 గంటలకు మదనపల్లెకు చేరుతుందన్నారు. రానుపోను చార్జీ రూ. 805 చెల్లించాలన్నారు. నాలుగు టిక్కెట్లు కంటే ఎక్కువ ఉంటే ఇంటి వద్దకు వచ్చి టిక్కెట్లు ఇస్తామన్నారు. భక్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు రథోత్సవం

వాల్మీకిపురం : జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన వాల్మీకిక్షేత్ర సాలకట్ల బ్రహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 9:15గంటలకు రథోత్సవం ప్రారంభమవుతుంది. టీటీడీ అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టారు. ఈ మేరకు రాత్రింబవలు టీటీడీ కార్మికులు రథాన్ని శుద్ధి చేసి, రంగులు వేసి రకరకాల పుష్పాలతో అలంకరణ చేశారు. భక్తులు రథాన్ని లాగేందుకు పెద్ద పెద్ద తాళ్లను ఏర్పాటు చేశారు. రథోత్సవంలో పాల్గొనేందుకు ఇప్పటికే వేలాదిమంది భక్తులు వాల్మీకిపురం చేరుకున్నారు.

అంగన్‌వాడీల్లో మెనూ పాటించాలి

గుర్రంకొండ : అంగన్‌వా డీకేంద్రాల్లో తప్పనిసరిగా మెనూ పాటించాలని డీపీఓ ధనలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని అమిలేపల్లెలో ఆమె పర్యటించారు. ఈసందర్భంగా ఆమె స్థానిక డంపింగ్ యార్డు, అంగన్‌వాడీ కేంద్రం, సచివాలయాలను తనిఖీ చేశారు. సచివాలయంలో రికార్డులు, హాజరు రిజిష్టర్‌ను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీల్లో ప్రభుత్వం మెనూ ప్రకారం విద్యార్థులకు ప్రతిరోజు పౌష్టికాహారం అందివ్వాలన్నారు. కేంద్రాల్లో అవసరమైన అన్ని వసతులు కల్పించాలన్నారు. అలాగే గ్రామాల్లో పారిశుద్ధ్యంపై కార్యదర్శులు దృష్టి సారించాలన్నారు. ప్రస్తుత సీజన్‌లో వైరస్‌లో ఎక్కువగా ప్రబలే అవకాశమున్నందును ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు.

పథకాలు పేదల తలుపు తడుతున్నాయి

- పారదర్శకంగా పథకాల అమలు
- గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



రాయచోటి: జగనన్న చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి



వృద్ధుడిని పలకరిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

సంబేపల్లె : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలే పేదల్ని వెతుక్కుంటూ వారి తలుపులు తడుతున్నాయని వైఎస్ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే జి.శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని గురిగింజకుంట గ్రామంలోని కాలువవాండ్లపల్లె, వంకవారిపల్లె, మాలపల్లె, మొరంకిందపల్లెలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. అందరిని ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యల పరిష్కారాలపై చొరవ చూపుతూ ప్రతి గడపను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ అర్హతే ఆధారంగా పథకాలు అందిస్తున్నామన్నారు. దేశచరిత్రలో ఎన్నడూ లేని విధంగా వినూత్నంగా సంక్షేమ క్యాలెండర్‌ను ప్రకటించిన ఏకైక ముఖ్యమంత్రి సీఎం జగన్ అని తెలిపారు.

ఇంటింటా ఆత్మీయ ఆదరణ, ఆప్యాయతతో కూడిన పలకరింపులతో కార్యక్రమం కొనసాగింది. అర్హులైన ప్రతి ఒక్కరికి పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందుతుండటంతో ప్రజలు సంతృప్తి చెందినట్లు ఆయనకు సమాధానమిచ్చారు. గ్రామంలో అర్హులైన వారికి ఇంటి స్థలాలు, పక్కా గృహాల మంజూరునకు శ్రీకాంత్‌రెడ్డి హామీఇచ్చారు. అనంతరం గడప గడప కార్యక్రమం 100రోజు పూర్తయిన సందర్భంగా గురిగింజకుంట గ్రామంలో 50 కేజీల కేకును ఎమ్మెల్యే గడికోట స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి కట్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగశ్రీలక్ష్మీ, రాష్ట్రకార్యదర్శి చిదంబరంరెడ్డి, సర్పంచ్ రఘునాథ రెడ్డి, జెడ్పీటీసీ కవిత, ఎంపీటీసీ శ్రీధర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఉపేంద్రనాథ్‌రెడ్డి, మండల స్థాయి అధికారులు, నాయకులు తదితరలు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి సీఎం పెద్దపీట

రాయచోటి టౌన్ : ప్రజారోగ్యానికి సీఎం జగన్ మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం రాయచోటి రూరల్ పరిధిలోని యండపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ.53.74 లక్షలతో పూర్తి చేసిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేదల వైద్యం కోసం ప్రత్యేక నిధులు కేటాయించారన్నారు. అందులో భాగంగానే రాయచోటి పరిధిలోని 9 పీహెచ్‌సీలను అభివృద్ధి పరిచినట్లు తెలిపారు. అనంతరం ఆస్పత్రిలోని వైద్యాధికారిణి డాక్టర్ శారదతో పాటు ఇతర సిబ్బంది నుంచి సమస్యలపై ఆరా తీశారు. ఓపీ సంఖ్యను పెంచాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డి, మండల బీసీ నాయకులు పల్లపు రమేష్, కౌన్సిలర్ కసిరెడ్డి నరసింహారెడ్డి, ఆర్అండ్‌బీ డీఈ సురేష్ నాయక్, ఎంపీడీఓ మల్‌రెడ్డి, ఏఈ గిరీష్, వ్యవసాయ జిల్లా సలహా సభ్యుడు దిన్నెపాడు రవిరాజు, ఎస్‌జీఓ అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి, కో-ఆప్షన్ దివాన్, ఎర్రబయన్న, నల్ల బయన్న, హరినాథరెడ్డి, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్ నాయుడు, లక్ష్మిరెడ్డి, రామాంజులరెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో అర్హులందరికీ ఇళ్లు

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఇళ్లు అందుతున్నాయని రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం రాయచోటి రూరల్ పరిధిలోని పెమ్మాడపల్లె బీసీ కాలనీలో పేద ప్రజలకు ఇళ్ల పట్టాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి మున్సిపాల్టీలో 26 వేల ఇళ్లు ఉన్నాయని చెప్పారు. కొత్తగా పట్టణానికి దగ్గరగా ఉన్న నారాయణరెడ్డిగారిపల్లె లే అవుట్‌లో ఏడువేలు, చెన్నముక్కపల్లె లే అవుట్‌లో రెండు వేలు, వరిగ లే అవుట్లో 150 ఇళ్లు, పెమ్మాడపల్లె లే అవుట్‌లో 200 ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని చెప్పారు. పేదల సొంతంటి కలను నెరవేర్చాలనే సీఎం జగన సంకల్పంతో అర్హత కలిగిన ప్రతి పేద వారికి ఇంటి పట్టాలు అందించారని చెప్పారు. కంకర, రాళ్ల కొట్టు కొనే చేతి వృత్తి వడ్డెర్లు రాయల్టీ కట్టకుండా ఉండేందుకు చర్యలు తీసుకొంటున్నామన్నారు. ఒక వేళ ఎక్కడైనా రాయల్టీ వసూలు చేసే వారు ఇబ్బంది పెడితే తన దృష్టికి తీసుకరావాలని కోరారు.

జగనన్న పాలనలో వెల్లివిరుస్తున్న మహిళా సంక్షేమం

రాయచోటి : మహిళా పక్షపాతి సీఎం జగన్‌మోహన్ రెడ్డి అని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శనివారం రాయచోటి రూరల్ మండల మూడో విడత వైఎస్సార్ ఆసరా సదస్సులో శ్రీకాంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంపీడీఓ మల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన మాటను జగనన్న మాట నిలబెట్టుకున్నారన్నారు. వైఎస్సార్ ఆసరా మూడో విడతలో రాయచోటి రూరల్ మండలంలోని 422 సంఘాలకు రూ. 3.14 కోట్లు జమఅవుతోందన్నారు. న్యాయం, ధర్మం సీఎం జగన్‌వైపు ఉన్నాయని, చంద్రబాబు పాలన అంతా మోసం, దగాలతో కూడుకున్నదన్నారు. ధర్మంవైపున ఉన్న జగనన్నకు అండగా నిలవాలని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి కోరారు. మహిళా సాధికారతలో దేశంలోనే సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. దిశా చట్టంతో మహిళలకు రక్షణగా నిలబడుతున్నారన్నారు. అనంతరం మహిళలు సీఎం జగనన్న చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. మెగా చెక్కును మహిళలకు అందజేశారు.

విషం చిమ్ముతున్న తోడేళ్లు..

ప్రజలుకోసం అనునిత్యం కృషి చేస్తున్న సీఎం జగన్‌పై తోడేళ్లు, గుంటనక్కలు చంద్రబాబు అండ్ కో విషం చిమ్ముతున్నారన్నారు. వారి దుష్ప్రచారాలను తిప్పికొట్టాలని ఆయన కోరారు. రాయచోటి వాసులపై ప్రేమతో సీఎం జగన్‌మోహన్ రెడ్డి జిల్లాను ఇచ్చారని, అటువంటి జిల్లా కేంద్రాన్ని టీడీపీ అధికారంలోకి వస్తే మరోచోటికి తీసుకెళ్తుంటే చూస్తూ ఊరుకుంటామా అని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ వెంకటేశ్వరరెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ శ్రీనివాసులు రెడ్డి, పల్లపు రమేష్, సర్పంచ్‌లు మమత, ప్రభావతి, తిరుపాల్ నాయుడు, కౌన్సిలర్ కసిరెడ్డి వెంకట నరసింహారెడ్డి, ఎంపీటీసీలు బోరెడ్డి నారాయణ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, దివాన్, నాగేశ్వర పాల్గొన్నారు.

వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు

సంబేపల్లె : మండలంలోని అడవికమ్మపల్లెలో వెలిసిన శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి మూలవిరాట్‌మూర్తిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయ అర్చకులు పలు పూజాది క్రతువులను నిర్వహించారు. వచ్చిన భక్తాదులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

లక్కిరెడ్డిపల్లెలో..

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని పలు ఆలయాలలో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాయచోటి- వేంపల్లి రహదారి మార్గంలోని మర్రి చెట్టు వద్ద వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో అర్చకుడు వెంకటనారాయణ శాస్త్రి ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేక పూజలు నిర్వహించారు. రామాపురం రోడ్డు మార్గంలోని గద్దగుండ్ల రాచపల్లి సమీపంలోని నామాలగుట్టపై వెలసిన శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంతోపాటు, అయ్యప్పస్వామి ఆలయంలో స్వామివార్లకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో భక్తులు, ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌పై అడ్వెంచర్ ఫెస్టివల్

బి.కొత్తకోట : మండలంలోని హార్సిలీహిల్స్‌పై ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో శనివారం స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులకు అడ్వెంచర్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన మదనపల్లె జిల్లా ఉప విద్యాశాఖ అధికారి కృష్ణప్ప మాట్లాడుతూ విద్యార్థుల్లో ధైర్య సహసాలు పెంపొందించడమే లక్ష్యంగా స్కౌట్ కబ్ మాస్టర్లు పనిచేయాలని కోరారు. భూకంపాలు, అగ్నిప్రమాదాలు, తుఫానులు సంభవించినప్పుడు ఎలా వ్యవహరించాలని అన్నదానిపై శిక్షణ ఇవ్వాలని కోరారు. అనంతరం గోల్డెన్ యూరో అవార్డులు పొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. స్కౌట్ విద్యార్థులు ప్రదర్శించిన పిరమిడ్ విన్యాసాలను తిలకించారు. కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యదర్శి నరసింహారెడ్డి, ఎంఈవో ప్రభాకర్‌రెడ్డి, జిల్లా శిక్షణ మిషనర్ భాస్కర్‌రెడ్డి, మాస్టర్లు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణోత్సవం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న గ్రామస్తులు

ఓబులవారిపల్లె : తల్లెంవారిపల్లె గ్రామంలోని రామాలయంలో శ్రీ సీతారాముల కల్యాణోత్సవం శనివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కల్యాణ వేదిక వద్ద సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసి పూజారులు వేద మంత్రాలతో ఘనంగా కల్యాణం జరిపారు. గ్రామస్తులు పెద్దఎత్తున కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. తల్లెంవారిపల్లి వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్నిరెడ్డి, గురివిరెడ్డి దంపతులు కల్యాణోత్సవం నిర్వహించారు. చిన్నిరెడ్డి అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. తల్లెంవారిపల్లి గ్రామంలో రాత్రి భజన కాలక్షేమం, అనంతరం రాత్రి గ్రామ పురవీధులలో ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు.

పుల్లంపేటలో..

పుల్లంపేట : మండల పరిధిలోని అనంతంపల్లి గ్రామంలోని రామాలయంలో శ్రీరామ నవమి ఉత్సవాలలో భాగంగా మూడోరోజు శనివారం శ్రీ సీతారాముల కల్యాణాన్ని వేదపండితులు శివశర్మ, ఆత్రేయులచే ఆధ్వర్యంలో ప్రకాష్ రెడ్డి, హరిత దంపతులు వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేకంగా అలంకరించారు. ప్రజలు పెద్దఎత్తున కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం పలువురు దాతలు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. శనివారం సాయంత్రం డప్పు వాయిద్యాల మధ్య సీతారాముల మూలవిరాట్‌లను గ్రామ పుర వీధులలో ఊరేగించారు.


మహావిష్ణువు అవతారంలో రామచంద్రుడు

రాజంపేట రూరల్ : నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహించుకుంటున్న శ్రీ రామ నవమి వేడుకలు శనివారం 3వ రోజుకు చేరుకున్నాయి. శనివారం కావడంతో వేడుకగా కల్యాణాలు, గ్రామోత్సవాలు నిర్వహించారు. శ్రీరామనవమి వేడుకలలో భాగంగా మండల పరిధిలోని భువనగిరిపల్లెలో 3వ రోజు శ్రీమహావిష్ణువు అలంకారంలో సీతారాములను ప్రత్యేకంగా కొలువుదీర్చారు.

రామ భద్రుడికి అభిషేకం

రామాపురం : మండలంలోని నల్లగుట్టపల్లి గ్రామం కస్పాలోని రామాలయంలో శనివారం సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వాముల దేవతామూర్తులకు అభిషేకాలు నిర్వహించినట్టు లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్‌రెడ్డి, సర్పంచ్ అయోధ్యపురం నాగభూషన్‌రెడ్డిలు తెలిపారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని మహిళలు, ప్రజలు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామికి పూజలు చేశారు. అర్చకుడు గురుశేఖర శర్మ తీర్థప్రసాదాలు, పానకం, వడపప్పును భక్తులకు అందించారు.

విశాఖ ఉక్కును ప్రైవేటీకరించవద్దు



నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐటీయూసీ నేతలు

రాయచోటి అర్బన్ : విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ యత్నాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వెంటనే ఆపాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు సిద్దిగాళ్ల శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి సాంబశివలు డిమాండ్ చేశారు. విశాఖలో జరుగుతున్న ఉక్కు పరిశ్రమ పరిరక్షణ ఉద్యమం నేటికి 700 రోజులు పూర్తి చేసుకోవడాన్ని పురస్కరించుకుని ఏఐటీయూసీ నేతలు రాయచోటి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం ఎన్నో బలిదానాలు జరిగాయన్నారు. ఎంతో మంది రైతులు భూములు ఇచ్చారన్నా రు. అప్పటి ప్రజాప్రతినిధుల పోరాటంతో ఉక్కుపరిశ్రమ ఏర్పాటైందని పేర్కొన్నారు. కేంద్రంలో మోడీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నష్టాల సాకుతో ప్రభుత్వరంగ పరిశ్రమలను ప్రైవేటీకరించేందుకు పూనుకుంటోందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వ పెద్దలు స్పందించి విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించబోమని ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, రాయచోటి కార్యదర్శి పుల్లయ్య, నేతలు బత్తల వెంకటరమణ, చల్లా రెడ్డయ్య, ఎమ్మార్పీస్ నేతలు నరసింహులు, ఆనంద్, వేణుగోపాల్ తోపాటు పలువురు పాల్గొన్నారు.

అంతర పంటలతో తెగుళ్ల నివారణ

వాల్మీకిపురం : ప్రకృతి వ్యవసాయంలో ప్రధాన పంటల మధ్య అంతర పంటలు వేయడం వలన తెగుళ్ల నివారణ సులభమని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శ్రీనివాసులు, పెద్ద రెడ్డెయ్య అన్నారు. శనివారం మండలంలోని మంచూరు గ్రామంలో 0.30 సెంట్లు విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయంలో ఏ గ్రేడ్ మోడల్‌ను చిన్నమండెం, సంబేపల్లి మండలాల్లో పని చేస్తున్న 30 మంది ప్రకృతి వ్యవసాయ సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన ఏ గ్రేడ్‌పొలంలో మిత్ర పురుగులు ఎక్కువ ఉన్నాయని, శత్రు పురుగులు తక్కువ ఉన్నాయన్నారు. ప్రధాన పంట అరటిలో 30 రకాల విత్తనాలు అంతర పంటలు వేశారన్నారు. కార్యక్రమంలో రైతు నారాయణ రెడ్డి, సిబ్బంది రెడ్డిబాషు, అనురాధ, రేణుక, రాజేశ్వరి, వెంకట్రమణ నాయక్, సుజాత, వంశి తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలను చింపిన గుర్తు తెలియని వ్యక్తులు



సిద్దవటం : మండలంలోని వైఎస్ఆర్‌సీపీ నాయకులు ఏర్పాటు చేసిన బ్యానర్లను గుర్తు తెలియని వ్యక్తులు చింపేశారు. ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహోత్సవాలను పురస్కరించుకొని ఈనెల 5వ తేదీన సీతా, రాముల కల్యాణోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్న సందర్భంగా వైఎస్ఆర్‌సీపీ నాయకులు మండలంలోని భాకరాపేట నుంచి ఒంటిమిట్ట వరకు బ్యానర్లను ఏర్పాటు చేశారు. ఈ బ్యానర్లను కొందరు గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి చింపేశారు.

బిందుసేద్యంతో అధిక దిగుబడి

కలికిరి : బిందు సేద్యంతో అధిక దిగుబడులు సాధించవచ్చని కేవీకే సమన్వయకర్త డా. జీఎస్ పాండురంగ అన్నారు. స్థానిక కేవీకే కార్యాలయంలో పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో సూక్ష్మ నీటిపారుదల పద్ధతులు, ప్రాముఖ్యతపై రైతులకు అవగాహన కల్పించారు.

జ్యోతిరావు పూలే విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన

ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు



స్థల పరిశీలన చేస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల తదతరులు

రైల్వేకోడూరు : వెనుకబడిన తరగతులు, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి, సంక్షేమానికి కృషి చేసిన మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహ ఏర్పాటుకు పట్టణంలో శనివారం ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 11న పూలే జయంతి సందర్భంగా పట్టణంలో ఆయన విగ్రహం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు వైపు విగ్రహ ఏర్పాటుకు అనుకూలంగా భావిస్తున్నామన్నారు. అలానే స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డెర ఓబన్న విగ్రహం కూడా కోడూరులో ఏర్పాటు చేస్తామన్నారు. పట్టణంలో రూ.5కోట్ల 80లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. అలాగే ఉప సర్పంచ్ తోట శివసాయి సొంత నిధులతో కోడూరు చిట్వేలి రోడ్‌లో నిర్మిస్తున్న బస్‌షెల్టర్‌ను పరిశీలించారు. అనంతరం శ్రీక్రిష్ణ కాంప్లెక్స్ ఆవరణలో నూతన బస్‌షెల్టర్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. మండలంలోని తాడివాండ్లపల్లెకు చెందిన కుంచం యానాది అనారోగ్యంతో చికిత్స పొందుతూ కోడూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందడంతో ఆసుపత్రిలో మృతదేహాన్ని సందర్శించి నివాళర్పించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, సర్పంచ్ శివయ్య, జనార్దన్‌రాజు, ఇనమాల మహేష్, డాక్టర్ చైతన్య, మందల నాగేంద్ర, రత్తయ్య, రౌఫ్, దామర్ల సిద్దయ్య, బత్తల సుబ్రమణ్యం, దొంతిరెడ్డి రాజారెడ్డి, రమణారెడ్డి, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి



రైతులకు సూచనలిస్తున్న అధికారి నాగమణి

రామాపురం : సకాలంలో మామడిలో సస్యరక్షణ చర్యలు చేపడితే నాణ్యతతో కూడిన అధిగ దిగుబడి పొందవచ్చునని ఉద్యానవనశాఖ అధికారి టి.నాగమణి పేర్కొన్నారు. శనివారం రాచపల్లి, హసనాపురం గ్రామాల్లో మామిడిని ఆశించే నల్లతామర పురుగు, పండు ఈగ నివారణపై రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులనుద్దేశించి మాట్లాడుతూ మామిడి కాయపై చిన్నచిన్న మచ్చలు నక్షత్రకారపు మచ్చలు గరుకుగా అవ్వడం, మసిలాగ ఏర్పడటం నల్లతామర పురుగు వల్ల జరుగుతుందని, నివారణకు పిప్రోనిల్ ఒక మి.లీ/ లీటరు, ఎసిఫెట్ ఒక గ్రాము ఒక లీటరు నీటికి మరియు అజాడిరక్టిన్ కలిపి పిచికారీ చేయాలని వివరించారు. అలాగే నల్లతామర పురుగుల నివారణకు తోటలో పసుపు మరియు నీలి జిగురు అట్టలను ఎకరాకు 40 చొప్పున ఏర్పాటు చేసుకోవాలన్నారు. అలాగే పండు ఈగ నివారణకు మిథైల్ యుజినాల్ లింగాకర్షక బుట్టలను ఎకరాకు 8 చొప్పున చెట్లుకు 5-6 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పండు ఈగ కవర్లను ఏర్పాటు చేసుకొని మంచి నాణ్యతతో కూడిన దిగుబడిని పొందాలని సూచించారు. కార్యక్రమంలో అఫ్సర్ అలీ ఖాన్, వెంకటరమణ, మామిడి రైతులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు

లక్కిరెడ్డిపల్లె : రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 3వ తేదీ నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి చక్రీనాయక్ తెలిపారు. మండలంలోని మూడు పరీక్షా కేంద్రాలలో 460 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని ఆయన తెలిపారు. ఏపీ మోడల్ స్కూల్‌లో 160 మంది విద్యార్థులు జెడ్పీ బాలుర హైస్కూల్‌లో 150 మంది విద్యార్థులు జెడ్పీ బాలికల హైస్కూల్‌లో 150 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారన్నారు. ముగ్గురు చీఫ్ డిపార్ట్‌మెంట్స్, ముగ్గురు డిపార్ట్‌మెంటల్, ముగ్గురు సిట్టింగ్ స్క్వాడ్ నియమించిన్నట్టు చెప్పారు. విద్యార్థులు అర్ధగంట ముందు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. మూడు పరీక్షా కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

పది పరీక్షలకు సర్వం సిద్ధం

రామాపురం : ఏప్రిల్ 3వ తేదీ నుంచి 18వ తేదీ వరకు జరగనున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశామని మండల విద్యాశాఖ అధికారి రామకృష్ణుడు పేర్కొన్నారు. శనివారం ఎంఆర్సీలో విలేకర్లతో మాట్లాడుతూ మండల పరిధిలోని 6 జిల్లా పరిషత్ హైస్కూల్‌లు, 5 ప్రైవేటు పాఠశాలలు, ఆదర్శ పాఠశాల, ఏపీ గురుకుల పాఠశాల, కస్తూర్బా బాలికల పాఠశాలలకు సంబంధించి సుమారుగా 390 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలు రాస్తున్నట్లు ఆయన తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు అంటే 3.15గంటల పాటు పరీక్ష రాయాల్సి ఉంటుందని, పరీక్షా కేంద్రానికి హాల్ టికెట్లతో విద్యార్థులు 9 గంటలలోపే ఉండాలని తెలియజేశారు.

బ్రహ్మోత్సవం.. చూతము రారండి

కోదండ రాముడి బ్రహ్మోత్సవాలు రెండో రోజు వైభవంగా నిర్వహించారు. ఉదయం వేణుగానం అలంకారణలో దర్శనమిచ్చిన స్వామి వారు, సాయంత్రం హంస వాహనంపై మాఢ వీధులలో విహరించారు. స్వామి వారి వాహన సేవలకు ముందు ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించారు. కోలాటాలు, చెక్కభజనలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి వారిని ఊరేగించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని రామచంద్రుడి వాహనసేవలను చూసి తరించారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు.
– ఒంటిమిట్ట



ఊంజల్ సేవలో సేదతీరుతున్న ఉత్సవమూర్తులు



మంగళవాయిద్యాలను వాయిస్తున్న దృశ్యం



కోలాటమాడుతున్న చిన్నారుల బృందం

గర్భిణుల సంరక్షణలో అంగన్‌వాడీలే కీలకం

రాజంపేట రూరల్ : గర్భిణుల సంరక్షణలో అంగన్‌వాడీల పాత్ర ఎంతో కీలకమని ఏపీ మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ రవిచంద్రారెడ్డి కొనియాడారు. మండల పరిధిలోని కే బోయనపల్లి సెక్టార్‌లోని తాళ్లపాక అంగనవాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న పోషణ పఖ్వాడా కార్యక్రమంలో సీడీపీఓ పి.నిర్మలతో కలిసి శనివారం ఏపీ మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ రవిచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గర్భిణులకు డైరెక్టర్ రవిచంద్రారెడ్డి శ్రీమంతం కార్యక్రమం నిర్వహించారు. అదే విధంగా అంగనవాడీలో ఉన్న చిన్నారుల చేత అన్నప్రాసన చేయించారు. పదవీ విరమణ చెందుతున్న హేమాద్రివారిపల్లి అంగనవాడీ కార్యకర్తను ఈ సందర్భంగా సత్కరించారు.

అనంతరం అంగనవాడీలతో సమావేశం నిర్వహించి వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ఆవశ్యకతను వివరించారు. అదే విధంగా బాలమృతం ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో కే బోయనపల్లి సూపర్‌వైజర్ పీ పార్వతమ్మ, ప్రాజెక్టు అసిస్టెంట్ హెచ్.రమేష్, అంగనవాడీ కార్యకర్తలు బీ రాజేశ్వరమ్మ, సీ నాగసులోచన, ఎస్ రేవతి, ఎన్ కృష్ణవేణి, వెంకటలక్షుమ్మతో పాటు బోయనపల్లి సెక్టార్ పరిధిలోని అంగనవాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.